క్లుప్తంగా

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రారంభం


పోలవరం సచివాలయంలో పేదలకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ నిర్వహిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పోలవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ప్రారంభించారు. ఇళ్ల పట్టాలు పొందిన పేదలందరికీ పంచాయతీ కార్యాలయంలో అధికారులు రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని కార్యదర్శి వై.కొండలరావు పరిశీలించారు.

చింతలపూడి ఎంపీడీఓగా సీహెచ్ చిన్న రాట్నాలు


సీహెచ్ చిన్న రాట్నాలు

చింతలపూడి: చింతలపూడి ఎంపీడీవోగా సీహెచ్ చిన్న రాట్నాలు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఎన్టీఆర్ కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన మురళీకృష్ణ అల్లూరి సీతారామరాజు జిల్లా ఏటపాక మండలానికి బదిలీ అయ్యారు. ఎంపీడీఓ రాట్నాలు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా తులసి


కాసర తులసిరెడ్డి

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా పట్టణానికి చెందిన కాసర తులసి రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. తులసి రెడ్డి జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో కౌన్సిలర్‌గా ఉన్నారు. వైఎస్సార్ సీపీలో ఈమె కుటుంబం ఎన్నో సేవలు అందించింది. ఆమె నియామకం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

లింగపాలెం ఎంపీడీవోగా రాంబాబు


ఎంపీడీవో రాంబాబు

లింగపాలెం: లింగపాలెం ఎంపీడీవోగా వరుదు రాంబాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లా కలిదిండి ఎంపీడీవోగా పని చేస్తూ ఆయన లింగపాలెం మండలానికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో ఆశీర్వాదం కృష్ణా జిల్లా రెడ్డిగూడెం మండలానికి బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో రాంబాబును కార్యాలయ సిబ్బంది, ఈవోపీఆర్‌డీ రత్నకుమార్, సూపరింటెండెంట్ మణికుమారి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

క్షేత్రంలో భక్తుల రద్దీ సాధారణం

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో ప్రతి శనివారం వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శిస్తారు. అయితే ఈ వారం స్వల్ప సంఖ్యలో భక్తులు శ్రీవారిని దర్శించారు. దాంతో ఆలయ పరిసరాల్లో సాధారణ భక్తుల రద్దీ కనిపించింది. మధ్యాహ్నం నుంచి ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, వైకుంఠం క్యూకాంప్లెక్స్, అనివేటి మండపం, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల తదితర విభాగాలు ఖాళీగా మారాయి.

పారిజాతగిరిలో పూజలు


పారిజాతగిరిలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. జంగారెడ్డిగూడెం వికాస తరంగిణి భక్త బృందం సభ్యులు శ్రీశ్రీనివాస గానామృతం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేసిన దాతలను ఆలయ అర్చకులు నల్లూరి రవికుమార్, జి.రాఘవా ఆచార్యులు శ్రీస్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలతో వేద ఆశీర్వాదం అందజేశారు.

4 నుంచి రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ టోర్నీ

జంగారెడ్డిగూడెం: ఈ నెల నాలుగు నుంచి ఆరో తేదీ వరకు 67వ రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు ఏలూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి డి.రాజేంద్రప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ -14, 17 విభాగాల్లో నిర్వహించే బాలబాలికల టోర్నీ పాఠశాల విద్యాశాఖ, రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతుందని వివరించారు. ఈ టోర్నమెంట్ జంగారెడ్డిగూడెం జెడ్పీ హైస్కూలులో జరుగుతుందని పేర్కొన్నారు.

కదిలిన జగనన్న సైన్యం


బుట్టాయగూడెం: జెండా ఊపి బస్‌లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు

బుట్టాయగూడెం: జగనన్న సైన్యం కదిలింది. దెందులూరులో శనివారం జరిగిన సిద్ధం సభకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం పేరుతో నిర్వహించిన దెందులూరు బహిరంగ సభకు పోలవరం నియోజకవర్గం నుంచి 7 మండలాల పరిధిలో భారీగా పార్టీ శ్రేణులు బస్సులు, కార్లలో ర్యాలీగా తరలివెళ్లారు. బుట్టాయగూడెం నుంచి సిద్ధం కార్యక్రమానికి బయల్దేరిన బస్‌లను ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుష్ట చతుష్టయాన్ని ఓడించడానికి నేను సిద్ధం.. మీరు సిద్ధమా... అంటూ పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులు మేమంతా సిద్ధమంటూ నినదించారు. పోలవరం నియోజకవర్గ పరిధిలోని 7 మండలాల్లో సుమారు 35 కార్లు, 107 బస్సుల్లో సుమారు 6 వేల మందికి పైగా కార్యకర్తలు సిద్ధం సభకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమాల్లో ఆయా మండలాలకు చెందిన జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, మండల కన్వీనర్‌లు, సొసైటీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి: దెందులూరు సిద్ధం సభకు చింతలపూడి నియోజకవర్గం నుంచి శనివారం జగనన్న సైన్యం పెద్ద ఎత్తున తరలివెళ్లారు. నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, వివిధ పథకాల్లో లబ్ధిపొందిన లబ్ధిదారులు వేలాదిగా జగన్ సభకు తరలివెళ్లారు. చింతలపూడి, లింగపాలెం, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం మండలాల నుంచి బస్‌లు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలపై దెందులూరులో సభకు హాజరయ్యారు. రాష్ట్రంలో సంక్షేమ విప్లవం తీసుకు వచ్చి ప్రజలకు సువర్ణ పాలన అందిస్తున్న జగనన్నను మరోసారి గెలిపించుకుంటామని నినాదాలతో హోరెత్తించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపీపీ డా రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జ్ఞానారెడ్డి, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కె దినేష్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాస రావు, పట్టణ సచివాలయాల కన్వీనర్ ఎం.దుర్గారావు, పార్టీ పట్టణ కన్వీనర్ కొప్పుల నాగేశ్వర రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎం ఇమ్మానియేలు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్ కాంతారావు, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎస్.భరత్ రెడ్డి, మండల విభాగం కన్వీనర్ ఎం.దిలీప్, ఎస్.రమేష్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, తాండ్ర రామకృష్ణారావు, టి.భూపతి, ఆర్‌వీ రామారావు, వెంపా కృష్ణ, రామరాజు నాయక్, ఎం రాంబాబు, ఎ.సుబ్బారావు, కె.ఏలియ్య, శ్రీనివాసరెడ్డి తదితరులు తరలివెళ్లారు.

మళ్లీ సీఎంగా చేయడమే ధ్యేయం

దెందులూరులో సిద్ధం సభకు మార్కెట్ కమిటీ చైర్మన్ జగ్గవరపు జానకి రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్దెత్తున తరలివెళ్లారు. సుమారు 35 బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలపై కార్యకర్తలను భారీగా సభకు తరలించినట్లు జానకిరెడ్డి తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవడమే ధ్యేయంగా కార్యకర్తలు ఎన్నికల శంఖారావం పూరించినట్లు చెప్పారు.

ప్రతి గ్రామం నుంచి..

కామవరపుకోట: దెందులూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన ఎన్నికల శంఖారావం సిద్ధం సభకు మండలంలో ప్రతి గ్రామం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. కళ్ళచెరువు, కేఎస్.రామవరం నుంచి ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, అశోక్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో, తడికలపూడి నుంచి జెడ్పీటీసీ కడిమి రమేష్, సర్పంచ్ కొత్తపల్లి రజిని శ్రీనివాస్ ఆధ్వర్యంలో జలపవారిగూడెం, అంకాలంపాడు నుంచి మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ కేసరి సరితా రెడ్డి ఆధ్వర్యంలో, కామవరపుకోట నుంచి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్ బాబు, సొసైటీ చైర్మన్ సాయన కనకరాజు, మెడూరి రంగబాబు ఆధ్వర్యంలో, కొత్తూరు నుంచి కామవరపుకోట సర్పంచ్ కరిపోతు అనూష, భాగ్యరాజ్ ఆధ్వర్యంలో, రామన్నపాలెం నుంచి రాయంకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు.

కొయ్యలగూడెంలో భారీ ర్యాలీ

కొయ్యలగూడెం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన ఎన్నికలకు సిద్ధం సభకు మండలం నుంచి భారీగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు శనివారం తరలివెళ్లారు. ప్రజాప్రతినిధులు, రాష్ట్ర మండల గ్రామస్థాయి వైఎస్సార్‌సీపీ నాయకులు, అదేవిధంగా నామినేటెడ్ పదవి సభ్యులు ఆధ్వర్యంలో రెండు వేల మందికి పైగా శ్రేణులు వాహనాలలో బయలుదేరారు. ఈ సందర్భంగా వాహనాలను వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు జెండా ఊపి ప్రారంభించారు. 18 పంచాయతీల పరిధిలోని సచివాలయాల కన్వీనర్లు గృహ సారథులు ముందుగా కొయ్యలగూడెంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

జంగారెడ్డిగూడెం నుంచి...

జంగారెడ్డిగూడెం రూరల్: దెందులూరులో సిద్ధం సభకు జంగారెడ్డిగూడెం మండలంలో 20 పంచాయతీల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు భారీగా తరలివెళ్లారు. 21 బస్సులతో పాటు కార్లు, ద్విచక్ర వాహనాలపై పార్టీ శ్రేణులు ఉత్సాహంగా కదిలారు. పుట్లగట్లగూడెంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పార్టీ జెండాలను ఊపి ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు, గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు దెందులూరు సీఎం సభకు తరలి వెళ్లారు.

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణం, మండలం నుంచి భారీగా సిద్ధం సభకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు బయలుదేరి వెళ్లారు. పట్టణం, మండలం నుంచి 26 బస్సులు, 30 కార్లలో జై జగనన్న అంటూ సిద్ధం సభకు భారీగా తరలివెళ్లారు. బస్సులను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మేడవరపు విద్యాసాగర్, జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పోల్నాటి బాబ్జి, మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి అంజి తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ అచ్చిరాజు, మండల కమిటీ అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, బత్తిన చిన్న, తాతకుంట్ల రవికుమార్, చిప్పాడ వెంకన్న, నేట్రు గణేష్, వెంప ఐజక్, గంజి వినోద్, షేక్ అక్బర్, అమీర్, గెద్దాడ శ్రీనివాస్, వంది రాజా, కౌన్సిలర్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ ఆయా విభాగాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు.

పోలవరం నుంచి..

పోలవరం రూరల్: పోలవరం మండలం నుంచి దెందులూరు సిద్ధం సభకు అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి ఆధ్వర్యంలో పోలవరం నుంచి బస్సుల్లో తరలివెళ్లారు. బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు. అలాగే మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ కూడా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి తరలి వెళ్లారు.

లింగపాలెం నుంచి..

లింగపాలెం: దెందులూరు సభకు లింగపాలెం మండలం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ధర్మాజీగూడెంలో పార్టీ మండలాధ్యక్షుడు కొఠారి మోహన్, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్ జెండా ఊపి బస్సుల ర్యాలీని ప్రారంభించారు. బస్సులు, కార్లు, ఆటోలు, బైక్‌లపై వేలాది మంది కార్యకర్తలు సీఎం సభా ప్రాంగణానికి తరలి వెళ్లారు. మాజీ ఏఎంసీ చైర్మన్ మండలపు సాయిబాబ, పార్టీ సీనియర్ నాయకులు టీవీఎస్ రెడ్డి, పార్టీ ముఖ్య నేత ముసునూరి వెంకటేశ్వరరావు, నాయకులు రెడ్డిన శ్రీను, వినుగంటి రాజేష్, ప్రభాకర్ రెడ్డి, తలగళ్ళ రవిబాబు, తాడేపల్లి శాంతారావు, మాజీ జెడ్పీటీసీ కట్టా సత్యనారాయణ, రావికొండయ్య తదితరులు తరలివెళ్లారు.

కిక్కిరిసిన బస్సులు


కుక్కునూరు: సిద్ధం సభకు తరలివెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

కుక్కునూరు: దెందులూరులో శనివారం నిర్వహించిన సిద్ధం బహిరంగ సభకు మండలం నుంచి 10 బస్సులలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. నాయకులు, అభిమానులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలిరావడంతో బస్సులన్నీ కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధం వాల్‌పోస్టర్లతో జై జగన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. సభకు వెళ్లిన వారిలో ఏఎంసీ డైరెక్టర్ గంగుల రమణారెడ్డి, నాయకులు రావు వినోద్, ఎల్లంకి లక్ష్మణ్‌రావు, కోటగిరి నళినిప్రవార్, సర్పా శ్రీహరి, రేఖం విజయబాబు, గంజి రాజేష్, చేకూరి నవీన్, నకిరికంటి నరసింహ రావు, రాయి సత్యనారాయణ, రాయి రవి, అమరవరపు శ్రీనివాసరావు, గుమ్మల సత్యనారాయణ, గుమ్మల అచ్చయ్య, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఉన్నారు.

ద్వారకాతిరుమల మండలంలో కోలాహలం


ద్వారకాతిరుమల: సిద్ధం సభకు తరలివెళుతున్న ద్వారకాతిరుమల మండల నాయకులు, కార్యకర్తలు

ద్వారకాతిరుమల: దెందులూరులో శనివారం జరిగిన సిద్ధం బహిరంగ సభకు ద్వారకాతిరుమల మండలం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు వేలాదిగా తరలివెళ్లారు. ముందుగా వారంతా 30 బస్సులు, వందకు పైగా కార్లు, వెయ్యికి పైగా బైక్‌లపై బయల్దేరి మధ్యాహ్నం పంగిడిగూడెం శివారుకు చేరుకున్నారు. అక్కడ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. అనంతరం వారంతా కోలాహలంగా సిద్ధం సభకు ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దెందులూరులో చేపట్టిన సిద్ధం కార్యక్రమం ఒక ప్రభంజనాన్ని సృష్టించిందన్నారు. వేలాది మంది లబ్ధిదారులు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమానికి తరలివచ్చారని చెప్పారు. ఈ సభ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని పెంచిందన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకు, వైఎస్సార్ అభిమానులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, జేసీఎస్ కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ మస్తాన్ భాషా, ఆచంట బన్ను, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు అచ్యుత ఏసుబాబు, ఉక్కుర్తి వెంకట్రావు, సర్పంచ్ కుంటం స్వర్ణలత, జిత్తుక శ్రీను, చిట్టిబొమ్మ ప్రసాద్, బుసనబోయిన వంశీ, పెండ్యాల విజయ్, నిట్టా నాగేశ్వరరావు, దాకారపు అగ్గియ్య, దాసరి రాంబాబు, మానుకొండ సుబ్బారావు, మానుకొండ ప్రసాద్, సాదనాల రాజా తదితరులున్నారు.


చింతలపూడి: దెందులూరు సిద్ధం సభకు తరలివెళ్తున్న ఊటసముద్రం నాయకులు, కార్యకర్తలు


చింతలపూడి: జై జగన్ అంటూ నినదిస్తూ ర్యాలీగా బయలుదేరి వెళుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు


కామవరపుకోట: మేము సైతం సిద్ధం అంటూ సభకు తరలివెళ్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు


కొయ్యలగూడెం: సిద్ధం సభకు తరలివెళ్తున్న వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న దాసరి విష్ణు


జంగారెడ్డిగూడెం రూరల్: బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు హరిబాబు


జంగారెడ్డిగూడెం: సిద్ధం సభకు భారీగా తరలివెళుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు


పోలవరం రూరల్: వైఎస్సార్ సీపీ శ్రేణుల బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి


లింగపాలెం : ధర్మాజీగూడెంలో బస్సు ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

బదిలీపై వెళ్తున్న తహసీల్దార్లకు సత్కారం


కొయ్యలగూడెం: తహసీల్దార్ పాశం నాగమణిని సత్కరిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు


ద్వారకాతిరుమల: తహసీల్దార్ సతీష్‌ను సత్కరిస్తున్న రైతు బాలకృష్ణ

కొయ్యలగూడెం: మూడున్నర ఏళ్లుగా తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ, అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలానికి బదిలీపై వెళ్తున్న పాశం నాగమణిని కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆమె బదిలీకి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆమె శుక్రవారం సాయంత్రం కొయ్యలగూడెం నుంచి రిలీవ్ అయ్యారు. ఈసందర్భంగా తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు, గ్రామ సర్వేయర్లు ఆమెను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ విధుల్లో తనకు సహకరించిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌కుమార్, సివిల్ సప్లయిస్ డీటీ శ్రీనివాస్, ఆర్‌ఐ మణి దివ్య, జంగారెడ్డిగూడెం రెవిన్యూ డివిజన్ అధ్యక్షుడు అడపా రాంబాబు, వీఆర్వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమలలో...

ద్వారకాతిరుమల: మచిలీపట్నం అర్బన్‌కు బదిలీ అయిన ద్వారకాతిరుమల తహసీల్దార్ పొట్లూరి సతీష్‌ను వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. అలాగే మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు సైతం ఆయనను కలసి సన్మానించారు. ఈ సందర్భంగా తిరుమలంపాలెంకు చెందిన రైతు బంటుమిల్లి బాలకృష్ణ మాట్లాడుతూ తిరుమలంపాలెంలో భూమిని కోల్పోయి 41 ఏళ్లుగా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్న లబ్ధిదారులకు ప్రత్యామ్నాయ భూమిని అందించి ఆన్‌లైన్ చేయటంలో ఆయన చూపిన చొరవ మరువలేనిదని, దాని వల్ల తన సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. తహసీల్దార్ సతీష్‌ను సత్కరించిన వారిలో నిట్టా వెంకటేష్, ధనుంజయరావు, గుడెల్లి వెంకట్రావు, జొన్నకూటి వెంకయ్య, షయ్యద్ జిన్నా తదితరులున్నారు.

విద్యావిజ్ఞాన ప్రదర్శన


విద్యా విజ్ఞాన ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

పోలవరం రూరల్: గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 9వ తరగతి విద్యార్థులచే ఇంగ్లిష్ అకడమిక్ ప్రదర్శన జరిగింది. ఇప్పటిదాకా నేర్చుకున్న పాఠ్యపుస్తక అంశాలను వివిధ ప్రక్రియలు, సంభాషణలు, ఉపన్యాసాలు, కథలు, రోల్ ప్లేలు, ప్రదర్శించి పలువురి ప్రశంసలు అందుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు కేవీ రాఘవన్ మాట్లాడుతూ ఈ రోజుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ చాలా అవసరం అని, పాఠశాలల్లో జరిగే ఇటువంటి కార్యక్రమాలు పిల్లల్లో ప్రదర్శన నైపుణ్యాలను పెంచుతుందని పేర్కొన్నారు. ఆంగ్ల ఉపాధ్యాయిని వంగీపురం స్వర్ణలత, పేరెంట్ కమిటీ మెంబర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ


జంగారెడ్డిగూడెం: డి.శేషారత్నంకు వృద్ధాప్య పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్ జి.గౌరి


కామవరపుకోట: వృద్ధురాలు నాగరత్నంకు పింఛన్ అందజేస్తున్న తాడిచర్ల వలంటీర్ శ్రీలక్ష్మి

జంగారెడ్డిగూడెం: పింఛన్ల పంపిణీ కార్యక్రమం శరవేగంగా జరుగుతోంది. వలంటీర్లు ఒకటో తేదీ వేకువజాము నుంచే పింఛన్‌ల పంపిణీ నిర్వహిస్తున్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్‌లు అందజేస్తున్నారు. ఇంటి వద్ద లబ్ధిదారులు అందుబాటులో లేకుంటే వారు ఎక్కడ ఉన్నది తెలుసుకుని వెళ్లి మరీ పింఛన్ సొమ్ము అందిస్తున్నారు. దీంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

కామవరపుకోట: మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన వృద్ధురాలు గుడేల్లి నాగరత్నం వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారు. ఇటీవల ఆమె అనారోగ్యంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కాళ్లకు ఆపరేషన్ చేయించుకుని నులకానివారిగూడెంలోని బంధువుల ఇంటి వద్ద ఉంటోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ తలపాకుల శ్రీలక్ష్మి నులకానివారిగూడెం వెళ్లి నాగరత్నానికి వృద్ధాప్య పింఛన్ అందజేసింది. దీంతో ఆ వృద్ధురాలు వలంటరీ శ్రీలక్ష్మికి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది.

దైవ సన్నిధి నుంచి తిరిగి వస్తూ...

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కొవ్వూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలోని వేంకటేశ్వరస్వామి వారి దర్శనానికి వెళ్లి, మోటార్ సైకిల్‌పై తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడేనికి చెందిన ఆవుల కనకేశ్వరరావు (27) దుర్మరణం పాలయ్యాడు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం విజ్జేశ్వరం బ్యారేజీ సమీపాన శనివారం ఈ ప్రమాదం జరిగింది. బైక్‌పై వస్తున్న కనకేశ్వరరావును సీతంపేట వైపు నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళుతున్న మరో మోటార్ సైక్లిస్టు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడిన కనకేశ్వరరావు తలకు బలమైన గాయమైంది. తీవ్ర రక్తస్రావంతో అతడు అక్కడికక్కడే మృతి చెందినట్టు కొవ్వూరు రూరల్ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కోనా శ్రీనివాసరావు తెలిపారు. వెనుక నుంచి వస్తున్న మృతుడి సోదరుడు ఆవుల పుల్లారావు ప్రమాదాన్ని గుర్తించారన్నారు. పుల్లారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని శ్రీనివాసరావు తెలిపారు. మృతుడు కనకేశ్వరరావుకు భార్య, మూడు నెలల పాప ఉన్నారు. కొవ్వూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

9న సప్తమ వార్షికోత్సవం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని అభయాంజనేయస్వామి వారి సప్తమ వార్షికోత్సవం ఈ నెల 9వ తేదీన నిర్వహిస్తున్నట్లు వారధి ట్రస్ట్ వ్యవస్థాపకులు వలవల తాతాజీ తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ శనివారం కరపత్రాలను ఆవిష్కరించింది. ఆరోజున ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు శ్రీలక్ష్మీగణపతి హోమం, అన్నసమారాధన, కూచిపూడి, భరతనాట్య ప్రదర్శన, కోలాటం, ఉచిత మెగా వైద్యశిబిరం, నేత్రవైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు.